


చిలకమర్తివారి గణపతి నాకెంతో యిష్టం. ఆ నవల్లో అక్షరముక్క రాని గణపతి అర్జంటుగా బడిపంతులై పోతాడు. తనకే అక్షరముక్క రాక పోతే పిల్లల కేం చెబుతాడింక. దాశరథి శతకములోని శ్రీరఘురామచారు తులసీదళదామ అనే పద్యానికి అర్థం శ్రీగణపతి తన సొంత తెలివి నుపయోగించిట్లా చెబుతాడు. శ్రీ రఘురామ- శ్రీరాములవారు. చారు-ఒకనాడు పైత్యముగానుండి చారు కాపించుకున్నారు, తులసీదళదామ- ఆ దేశములో కరివేపాకు లేదుగనక తులసీదళములే యందులోవేసి పోంగించినారు. శమక్షమాది శృంగార గుణాభిరామ- శ్రమ యావత్తు పోగొట్టగలిగి బహుశృంగారముగానున్నదట. ఆ చారుత్రి జగన్నుత శౌర్యలలామ-ఆ చారు త్రాగిన తరువాత

ఆ రాముల వారికి కావలసినంత శౌర్యము కలిగిందట రాక్షసులను చంపుటకు. దుర్వారకబంధ రాక్షస విరామ-వారి కందరకు కోపము పుట్టకుండా పోయినదట. జగజ్జన కల్మషార్ణవోత్తరకనామ - ఆ చారు తారక మంత్రము లాగు త్రాగిన జనులందరకూ కల్మషము కొట్టివేసినది. భద్రగిరి-వారికెంతో భద్రము కలిగినది.

ఇంకచాలు, చారు గొడవ వదిలేయండి. అల్లాంటి పంతులుగారి చేతుల్లో పిల్లలేం బాగుపడతారో దేవుడికే తెలియాలి. పాఠాలు చెప్పడం చేతగాకపోయినా, పిల్లల్ని అయినకాడికి చితకబాదడంలో గణపతి ప్రసిద్ధుడవుతాడు. గణపతి పిల్లల ప్రాణాలు తీస్తున్నాడని తెలిసి ఒక పెద్దమనిషి అతన్ని మందలించబోతే గణపతి తన ఆర్గ్యుమెంటునిట్లా చెబుతాడు. వెధవ చదువెంతసేపు వచ్చును? భయము వచ్చుట చాలా కష్టము. చదువు మరియొక పంతులయిన చెప్పగలడు. నావలె భయము చెప్పగలవారు మరొకరు లేరు. ఎంత చదువయినా నేను నెల దినములలో చెప్పివేయగలను. దాశరథియన రెండు కూనిరాగాలుతీసి చెప్పగానే సరియేమిటి? భయము చెప్పాలి. అది ప్రజ్ఞ, అది సొగసు.

ఏ బడిపంతులను చూసి ఈఉదంతం రాసేరో చిలకమర్తి వారికే తెలియాలి. ఇప్పటి వీధిబడులలో గణపతులింకా వున్నారని ఆరోపించలేను. కానీ అతగాడి వితండవాదాన్ని అనుకరించే గురుదేవులు నాకు తెలుసు. వీధి బడులన్ని ఇంచుమించు ఒకేలా ఉంటాయి. ఎప్పుడయినా అటువేపు నడవండి. చెవులు చిల్లులు పడేంత రొదని వింటారు. పేంబెత్తాల ఛక్ ఛక్‌లు వినిపిస్తాయి. ఏడిస్తే మరిన్ని తగుల్తాయని గుంట వెధవ గుండెల్లో నీళ్ళు కుక్కుకుని పుట్టెడు దుఃఖాన్ని కడుపులో దాచుకుంటాడు. వాడు మీ అబ్బాయి అయితే మీరెంత అల్లాడిపోతారో మీకే వదిలేస్తాను. గట్టిగా ఆరేళ్ళు నిండని అర్భకుడు. రాత్రి పడితే అమ్మపక్కనో నాన్నపక్కనో గట్టిగా కావిలించుకుని పడుకునే శుంఠ. వాడు మోయలేనన్ని పుస్తకాలు సంచిలో వేసుకుని బడికెళ్ళడమే ఒక ఫీటు. అల్లాంటి వెధవని చితకబాదే మనిషి గురు వెందుకవుతాడు? పచ్చి కసాయి

వాడని చెప్పాలి. కొట్టకపోతే చదువెలో అబ్బుతుందని మనలో చాలామంది అనుకోవడం విడ్డూరంగా వుంటుంది నాకు. పిల్లల్లో పిల్లవాడై, వాళ్ళకి నేస్తమై వాళ్ళ మనసుని ఆకట్టుకుని నాలుగక్షరాలు నేర్పగల నేర్పరే గురువు. అతడే దైవం. గురుదేవోభవకి సరయిన అర్థం. అంతేగాని ఇంట్లో చిరాకుని బడి పిల్లలమీద రుద్దే చవకబారు వ్యక్తి గురు శబ్దానికి అపస్వరం. జబ్బ బలం వుందిగదాని పేంబెత్తం ఉపయోగించే మేష్టారు మిలిటరీలో చేరాలిగాని మేష్టరీ వృత్తిలో కాదు.

నా చిన్నతనం నాకు బాగా గుర్తు. నేను వీధి బడిలో చదువుకున్నాను. పిల్లలు అన్నం తినకుండా మారాం చేస్తుంటే ఆ తల్లి కొన్ని పేర్లుచెప్పి, భయపెట్టి అన్నం తినిపించడం ఆచారం. బూచి వస్తున్నాడని భయపెట్టినా... అడుగో దొంగ అని అదరగొట్టినా గిన్నెలో అన్నం కడుపులోకి వెళ్ళి పోతుంది. ఇప్పుడు పోలీసులొస్తున్నారని చెప్పినా భయపడుతున్నారు. ఆ ఉద్యోగమేమిటోగాని పాపం పోలీసులు పిల్లల దృష్టిలో బూచిగాడితో సమానమవడం నిజంగా విచారించదగ్గ విషయమే. వదిలేయండి. నా చిన్న తనంలో బూచిగాడన్నా, దొంగ వెధవన్నా నేను భయపడేవాడ్నికాదు. పర బ్రహ్మంగారొస్తున్నారని చెబితే వణికి చచ్చేవాణ్ని. పరబ్రహ్మం నాకు మేష్టారు. ఆయనేం చెప్పాడో, నేనేం నేర్చుకున్నానో అడక్కండి. వంగో బెట్టి వీపుమీద పిడిగుద్దులు గుద్దేవారు. చెవులుపిండి చేతుల్లో పెట్టేవారు. తొడపాశం యమపాశం బాబులా వుండేది. అయ్యా, వెయ్యేల! ఆ పేరువింటే యిప్పటికీ దడే నాకు. గురువనే దైవం బూచిగాని, దొంగ, పోలీసుగానీ, దయ్యంగాని కాదు-ఆయనపేరు వింటేనా గడగడలాడిపోడానికి. మరదేం కర్మో....అలాంటి గురువులే ఎక్కువగా తగుల్తున్నారు.

వీధి బడులలో ఆడ టీచర్లుకూడా వుంటారు. వీళ్ళు ఆడవాళ్ళు కనక పిల్లల్ని కొట్టడం తక్కువేకాని కబుర్లెక్కువ. క్లాసులో పిల్లలు కీచులాడు కుంటూనే వుంటారు. ఆడ టీచర్లు మీటింగుల్లో మునిగిపోయి వుంటారు.

వాళ్ళ వాళ్ళ సొంత విషయాలతో, వివరాలతో యమబిజీగా వుంటారు. ఫలానా నిర్మలా టీచర్‌కి ఎన్నో నెలో కనుక్కుంటారు. ఫలానా సుభద్రా టీచరు కట్టుకొచ్చే చీర ధరెంతో తెలుసుకుంటారు. వారింట్లో ఏం కూరో, వీరింట్లో ఏం వ్రతమో ఆరా తీస్తుంటారు. ఇంక చదువేం చెబుతారు? నాలుగేళ్ళెంతరా చిట్టీ అని అడిగితే, అంతవరకు రాలేదంటాడు మూడో తరగతి చదివే సుపుత్రుడు. పిల్లల్ని వీధి బడులలో వేసేకంటే జేబులు కొట్టడంలో ప్రైవేటు చెప్పించడం బెటరంటాడు అప్పలస్వామి. వాడిదో విడ్డూరం. పట్టించుకోవద్దు.

ఈ బాధ పళ్ళేక ఏ కాన్వెంట్‌లోనయినా పిల్లల్ని చేర్పిద్దామంటే తాహతు చాలదు. దీనికి తగ్గట్టు విద్యారంగంలో ఏడాదికో రూలు, నెలకో పద్ధతి. అటు ఏలికలు, ఇటు గురువులూ పిల్లకాయల్ని అదరగొట్టేస్తున్నారు. ఈ రోడ్డెక్కడికిబాబూ అంటే, బోర్డుంది చూస్కో పొమ్మంటున్నారు. బోర్డు కోసం వెతుక్కుంటూపోతే ఎదర మహాసముద్రం. దూకడమా, ఒడ్డున నిలబడి కాలక్షేపం చేయడమా, అదొక సమస్య. ఉత్తుంగ తరంగాలు కనిపిస్తుంటాయి. ప్రళయ భీకరంగా హోరు వినిపిస్తుంటుంది. ఆ తరువాత అంతే సంగతులు.